



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పోర్ట్స్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 178 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/- ఆదివారం 02 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# మోస్ట్ ఫ్రెండ్లీ బడ్జెట్ ఇది- ప్రధాని మోదీ

ఈసారి దేశ రాజధానిలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): దేశ చరిత్రలోనే అత్యంత ఫ్రెండ్లీ బడ్జెట్ ఇదేనని మధ్యతరగతి ప్రజలు చెబుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి.. రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఇంత ఉపశమనం ఎప్పుడూ లభించలేదన్నారు.



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన ప్రచార సభలో తాజా బడ్జెట్ను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ ఈమేరకు ప్రసంగించారు. ఆప్ను ఢిల్లీకి ఆపదగా పేర్కొంటూ.. 'ఆప్-ద' ప్రభుత్వం 11 ఏళ్లు వృథా చేసిందని విమర్శించారు. "నెహ్రూ కాలంలో ఎవరికైనా రూ.12 లక్షల జీతం ఉంటే.. అందులో పావువంతు పన్నుకే వెళ్లేది. ఒకవేళ నేడు ఇందిరా గాంధీ పాలన ఉంటే. అదే జీతానికి రూ.10 లక్షలు పన్ను చెల్లించాల్సి వచ్చేది. 12 ఏళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో కూడా ఆ మొత్తానికి రూ.2.60 లక్షలు ట్యాక్సా పోయేది. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పేదలు, రైతులు, యువత, మహిళల సాధికారతకు మోదీ ఇచ్చిన గ్యారంటీలను ఈ బడ్జెట్ నెరవేరుస్తుందన్నారు. ఆప్ నేతలు పార్టీని వీడుతున్నారని, ప్రజల్లో పార్టీపై ఎంత ఆగ్రహం ఉందో వారు గ్రహించారని పేర్కొన్నారు. ఈసారి దేశ రాజధానిలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. భాజపాపై కేజీవాల్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తాము మురికివాడలను కూల్చేయబోమని, పథకాలను నిలిపివేయబోమని తెలిపారు. ఈనెల 8న కాషాయ పార్టీ విజయం సాధిస్తుందని, వచ్చే నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు రూ.2500 పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు.. 6న జడ్జిల బృందం పర్యటన

త్వరితగతిన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు.



నంద్యాల, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): త్వరితగతిన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం నంద్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 6న హైకోర్టు జడ్జిల బృందం కర్నూలుకు వస్తున్నట్టు మంత్రి చెప్పారు. కర్నూలు దిన్నె దేవరపాడు వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్కు చెందిన భవనాన్ని బృందం పరిశీలించనున్నట్టు తెలిపారు. బెంచ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు.

# కుంభమేళాకు 20 రోజుల్లోనే 33కోట్ల మంది.. వసంత పంచమి వేళ మరింత రద్దీ!

వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్న నేపథ్యంలో యూపీ ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది.

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్లను రంగంలోకి దింపింది.



జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90 లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. మౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్ పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు అశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్ తో కలిసి పని చేయనున్నారు. అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఘాట్లను పరిశీలించిన ఆయన.. స్నానాల తర్వాత ఘాట్ల వద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఇతరుల కోసం ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, ఘాట్ల వద్ద భోజనాలు చేయవద్దని చెబుతున్నారు. విశ్రాంతి కోసం భక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైక్లలో ప్రకటనలు చేశారు. ఇదిలాఉంటే, కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమిలను పవిత్ర రోజులుగా భావిస్తారు. వీటితోపాటు మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12), మహా శివరాత్రి (ఫిబ్రవరి 26) రోజుల్లోనూ అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.

# జనగణన ఇంకెప్పుడు చేస్తారు? :భారాస ఎమ్మెల్సీ కవిత

జనగణన ఇంకెప్పుడు చేస్తారని భారాస ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): జనగణన ఇంకెప్పుడు చేస్తారని భారాస ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్' వేదికగా కేంద్రాన్ని నిలదీశారు. జనగణనను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుందని అడిగారు. ప్రగతిశీల విధానాలకు ఆ వివరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

# కులగణన, సామాజిక సర్వేలో 3.50 కోట్ల మంది వివరాలిచ్చారు: మంత్రి ఉత్తమ్

వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్ కుమారెడ్డి అన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి అన్నారు. ప్లానింగ్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక అందజేశారు. కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్కుమార్రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామన్నారు. "స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన జరుగుతోంది. అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించింది. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టాం. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగింది. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా.. అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాం. కేబినెట్లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతాం. సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తొంది" అని మంత్రి ఉత్తమ్ వివరించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.



## కులగణన సర్వేలోని ముఖ్యాంశాలు...

- తెలంగాణలోని 3,54,77,554 మంది వివరాల నమోదు.
- మొత్తం 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు
- కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం
- సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం
- కులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎస్సీల జనాభా 17.43 శాతం
- ఎస్టీల జనాభా 10.45 శాతం
- రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతం
- ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08
- ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతం
- ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం
- రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం
- రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం

# ఇలాంటి బావమరిది దొరకడం అదృష్టంగా భావిస్తున్నా..: చంద్రబాబు నాయుడు

నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సోదరి నారా భువనేశ్వరి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాలయ్యకు అభినందనలు తెలుపుతూ ఆయన సోదరి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం రాత్రి హైదరాబాద్లో జరిగిన ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు.. బాలకృష్ణతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. వృత్తిపట్ల బాలయ్యకు ఉన్న నిబద్ధత గురించి మాట్లాడారు.



"ఒక పక్కన బాలయ్య.. మరోపక్కన అంతే పవర్ఫుల్ భువనేశ్వరి.. ఇద్దరి మధ్య ఇప్పుడు నేను నలిగిపోతున్నా (నవ్వులు). వీరిద్దరి మధ్య ఉంటే చాలా ప్రమాదం. నిన్నటి వరకూ అల్లరి బాలయ్య ఇప్పుడు పద్మభూషణ్ బాలయ్య. దేశం గర్వించదగ్గ బిడ్డ. మా కుటుంబంలో ఇలాంటి అవార్డు రావడం ఇదే తొలిసారి. కుటుంబ సభ్యులందరం ఎంతో గర్వపడుతున్నాం. ఇది కేవలం బిగినింగ్ మాత్రమే. ఇదొక అన్ స్టాపబుల్ ప్రయాణం. ప్రతి ఒక్కరూ జీవితంలో అత్యున్నత శిఖరాలను అందుకోవాలనుకుంటారు. ఒకే రంగంలో రాణిస్తుంటారు. కానీ, బాలయ్య వివిధ రంగాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1974లో తొలిసారి ఆయన సినిమాల్లోకి వచ్చారు. 78లో నేను తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. అంటే నాకంటే ఆయన నాలుగేళ్లు సీనియర్' "నందమూరి తారక రామారావు గారు ఒక చరిత్ర సృష్టించారంటే పట్టుదల, క్రమశిక్షణతోనే సాధ్యం. బాలయ్య పైకి అల్లరిగా కనిపిస్తాడు. కానీ లోపల ఎంతో క్రమశిక్షణ ఉంది. ఒక్కోసారి మూడు గంటలకే నిద్రలేచి పూజలు చేస్తాడు. నాకే ఆశ్చర్యం వేస్తుంది. అలాంటివి నావల్ల కాదు. 50 ఏళ్లుగా సినిమాల్లో ఎవర్గ్రీన్ హీరోగా రాణిస్తున్నారు. నేటితరం దర్శకులతో కలిసి విభిన్నమైన చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. ఆయనలో గొప్ప మానవతావాది ఉన్నారు. క్యాన్సర్ ఆస్పత్రి బాధ్యతలు ఆయన స్వీకరించిన తర్వాత దేశంలోని గొప్ప ఆస్పత్రుల్లో ఒకటిగా పేరు సొంతం చేసుకుంది. అందుకు గర్వపడుతున్నా. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే అయ్యారు. ఎంత ఎమోషనల్ గా ఉంటాడో అంత మంచి మనిషి నాకొక అద్భుతమైన బావమరిది దొరకడం నా అదృష్టంగా భావిస్తున్నా" అని చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో తమన్, గోపీచంద్ మలినేని వంటి సినీ ప్రముఖులు పాల్గొని చంద్రబాబుతో ఫొటోలు దిగారు. సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.

# అరసవల్లిలో రథసప్తమి వేడుకలు.. ఉత్సాహంగా సూర్యనమస్కారాలు

శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యదేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.

అరసవల్లి, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): శ్రీకాకుళంలోని అరసవల్లి సూర్యదేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉదయం సామూహిక సూర్యనమస్కారాలతో ప్రారంభమైన ఈ వేడుకలకు కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు హాజరయ్యారు. సుమారు 4వేల మంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా సూర్యదేవాలయం వద్ద రద్దీ నెలకొంది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమీపంలోని డచ్ భవనం వద్ద హెలికాప్టర్ రైడ్ ఏర్పాటు చేశారు. నిర్దేశిత రుసుంపై 8 నిమిషాలపాటు హెలీకాప్టర్లో తిరిగే అవకాశం కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ సేవలను అందుబాటులో ఉంచారు. హెలికాప్టర్ రైడ్ కోసం పెద్ద ఎత్తున యువత తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. హెలికాప్టర్ రైడ్, ఇతర ఏర్పాట్లను రామ్మోహన్నాయుడు పరిశీలించారు. సాయంత్రం లేజర్ షోతో పాటు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



# జీవీఎంసీలో టీడీఆర్ పేరుతో భారీ కుంభకోణం: జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్

జీవీఎంసీలో టీడీఆర్ పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు.

విశాఖపట్నం, ఫిబ్రవరి 2, (రిపబ్లిక్ న్యూస్): జీవీఎంసీలో టీడీఆర్ పేరుతో భారీ కుంభకోణం జరుగుతోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. వైకాపా హయాంలో రూ. వందలకోట్ల అక్రమ టీడీఆర్ లు పొందినవారు.. ఇప్పుడు వాటిని దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి నేతలకు ప్రలోభాలు పెట్టి జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. విశాఖపట్నం జనసేన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మూర్తియాదవ్ మాట్లాడారు. "డి-పట్టా, దేవస్థానం భూములకు వైకాపా హయాంలో అక్రమంగా ఎన్నో టీడీఆర్లు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నా వైకాపా మాఫియా ఎక్కడా తగ్గడం లేదు. పెండింగ్లో పెట్టిన టీడీఆర్లను విడుదల చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తవి ఇవ్వాలని జీవీఎంసీ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అక్రమ టీడీఆర్లను రద్దు చేసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. అలా చేయకపోతే జీవీఎంసీ రూ. వందలకోట్ల ఆదాయాన్ని కోల్పోతుంది. దీనిపై కూటమి ప్రభుత్వం అప్రమత్తం కావాలి" అని మూర్తియాదవ్ అన్నారు.





printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1863: ప్రముఖ తెలుగు రచయిత కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి జననం (మ.1940).
- 1902: భారత స్వాతంత్ర్య సమరయోధుడు మోటూరి సత్యనారాయణ జననం (మ.1995).
- 1925: ప్రముఖ సాహితీకారుడు తిమ్మావజ్ఝల కోదండ రామయ్య జననం (మ.1981).
- 1927: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఐ.సి.ఎస్.అధికారి సి.ఆర్.కృష్ణస్వామిరావు జననం (మ.2013).
- 1970: ప్రముఖ బ్రిటీషు తత్త్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ మరణం (జ.1872). (చిత్రంలో)
- 1971: ఒంగోలు జిల్లా ఏర్పాటయింది. తరువాత దీని పేరును ప్రకాశం జిల్లాగా మార్చారు.
- 1978: ప్రముఖ కవి, రచయిత, మొదటి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత జీ శంకర కురుప్ మరణం (జ.1901).
- 1985: శ్రీలంకకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు ఉపుల్ తరంగ జననం.
- 2012: తెలుగు సినిమా నిర్మాత, రచయిత అట్లూరి పుండరీకాక్షయ్య మరణం (జ.1925).


కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి


మోటూరి సత్యనారాయణ


సి.ఆర్.కృష్ణస్వామిరావు


బెర్ట్రాండ్ రస్సెల్


ప్రకాశం జిల్లా



జీ శంకర కురుప్


ఉపుల్ తరంగ


అట్లూరి పుండరీకాక్షయ్య

# అగ్ర హీరోలపై ప్రశ్న..
# విలేకరిపై పూజాహెగ్డే ఆగ్రహం

ఓ విలేకరిపై నటి పూజాహెగ్డే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసలు మీ సమస్య ఏంటి? అని ఆమె ప్రశ్నించారు.



పూజా హెగ్డే కథానాయికగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దేవా' ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పూజాహెగ్డే, నటుడు షాహిద్ కపూర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అగ్ర హీరోల చిత్రాల్లో నటించడంపై పూజాహెగ్డేకు ప్రశ్నలు ఎదురుకాగా.. ఆమె ఆగ్రహానికి గురయ్యారు. "బాలీవుడ్ అగ్ర హీరోలైన సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, రణ్వీర్ సింగ్, షాహిద్ కపూర్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడాన్ని అదృష్టంగా భావిస్తారా? ఆయా చిత్రాలకు మీరు అర్హులేనని అనుకుంటున్నారా?" అని విలేకరి ప్రశ్నించాడు. "ఆయా చిత్రాలకు నేను అర్హురాలినే. తమ చిత్రాల్లోకి నన్ను ఎంపిక చేసుకోవడంపై దర్శక నిర్మాతలకు కొన్ని కారణాలు ఉంటాయి. ఏదైనా అవకాశం వచ్చినప్పుడు దానికి అనుగుణంగా సన్నద్ధమై పూర్తి స్థాయిలో ఆ పాత్రకు న్యాయం చేయాలి. అలా చేస్తే అదృష్టం వరించినట్లే అనుకుంటా. నా జీవితంలో అదే జరిగింది. ఒకవేళ మీరు అదృష్టం వల్లే నాకు ఈ అవకాశాలు వచ్చాయనుకుంటే.. నేను ఏమాత్రం బాధపడను. అలాగే అనుకోండి" అని కాస్త అసహనం వ్యక్తం చేశారు. "మీరు సినిమాలు ఎలా ఎంచుకుంటారు? స్టార్ హీరోల చిత్రాలైతేనే చేస్తారా?" అని విలేకరి ప్రశ్నించాడు. స్టార్ హీరోల గురించి వరుస ప్రశ్నలు వేయడంపై పూజాహెగ్డే ఆగ్రహానికి గురయ్యారు. "అసలు మీ సమస్య ఏంటి?" అని ప్రశ్నించారు. వాతావరణం కాస్త హీటెక్కుతోందని భావించిన షాహిద్ కపూర్ వెంటనే సరదాగా మాట్లాడారు. "నువ్వు యాక్ట్ చేసిన స్టార్ హీరోలంటే అతడికి ఇష్టం అనుకుంటా. అతడు కూడా ఆ హీరోల పక్కన యాక్ట్ చేయాలనుకుంటున్నారు. అందుకే నీ నుంచి సలహాలు తీసుకుంటున్నట్లు ఉన్నారు" అని జోకులు వేశారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఫ్యాషన్ షోలో కన్నీళ్లు పెట్టుకున్న నటి

**బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్నారు. ర్యాంప్ వాక్ అనంతరం భావోద్వేగానికి గురయ్యారు.**



బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ (చాలా కాలం తర్వాత ఫ్యాషన్ షోలో సందడి చేశారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్, దివంగత రోహిత్ బాల్కు నివాళిగా శనివారం ఏర్పాటు చేసిన షోలో ఆమె పాల్గొన్నారు. ర్యాంప్ వాక్ చేసిన అనంతరం రోహిత్ బాల్ను గుర్తు చేసుకున్నారు. స్టేజ్పైనే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్మీడియాలో వైరల్ అయింది. రోహిత్ బాల్ సోనమ్ కపూర్కు మంచి అనుబంధం ఉంది. ఆయన డిజైన్ చేసిన దుస్తులను ఆమె ఎక్కువగా సెలక్ట్ చేసుకునేవారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ముందు ఆమె సోషల్మీడియాలో పోస్ట్ పెట్టారు. "కళాత్మకత, దార్శనికతతో భారతీయ ఫ్యాషన్ రంగాన్ని లెజెండరీ రోహిత్ బాల్ ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లారు. ఆయన్ని గుర్తు చేసుకుంటూ ర్యాంప్పైకి అడుగుపెట్టడం భావోద్వేగంగా ఉంది. ఇది స్ఫూర్తిదాయకమైన ప్రయాణం" అని ఆమె పేర్కొన్నారు. 1961 మేలో శ్రీనగర్లో జన్మించిన రోహిత్ బాల్.. 1986లో తన సోదరుడు రాజీవ్ తో కలిసి కెరీర్ను ప్రారంభించి దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్గా గుర్తింపు పొందారు. ఫ్యాషన్ రంగంలో తనదైన ముద్ర వేసి అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. గతేడాది నవంబర్లో మృతి చెందారు. 2023లో విడుదలైన 'బ్లైండ్' తర్వాత సినిమాలకు దూరమైన సోనమ్.. ప్రస్తుతం అనుజా చౌహాన్ రాసిన బ్యాటిల్ ఫర్ బిట్టోరా నవల ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రంలో నటిస్తున్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# నేను చెప్పలేను.. మా ఆవిడ చూస్తుంది :రోహిత్ శర్మ

**భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఇచ్చే సమాధానాలు చాలా ఫన్నీగా ఉంటాయి. తాజాగా బీసీసీఐ నమన్ అవార్డుల వేడుకలోనూ ఇలాంటి సన్నివేశం చోటు చేసుకుంది.**



బీసీసీఐ నమన్ అవార్డుల కార్యక్రమం ముంబయిలో ఘనంగా జరిగింది. భారత స్టార్ క్రికెటర్లందరూ ఒకే చోట కనువిందు చేశారు. సచిన్ తెందూల్కర్కు జీవితకాల సాఫల్య పురస్కారం వరించింది. ఈ సందర్భంగా పురుష, మహిళా క్రికెటర్లు నిర్వహించిన ప్రత్యేక చిట్చాట్లు ఫ్యాన్స్ను ఆకట్టుకున్నాయి. ఆ వీడియోలను బీసీసీఐ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఈ క్రమంలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్గా మారాయి. అసలేం జరిగిందంటే? రోహిత్ శర్మతోపాటు హార్దిక్ పాండ్య, మహిళా క్రికెటర్లు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ ఓ వేదికపై సందడి చేశారు. ఈ క్రమంలో రోహిత్ను స్మృతి ఓ ప్రశ్న అడిగింది. 'మీకున్న హాబీల్లో దేనినైనా సహచర క్రికెటర్లు ఆటపట్టించారా?' అని అడగ్గా.. దానికి స్పందిస్తూ.. "నాకైతే తెలియదు. కానీ, ఓ విషయంలో మాత్రం టీజ్ చేస్తుంటారు. అదే మరిచిపోవడం గురించి. కానీ, అది నా హాబీ కాదు. అలా ఎందుకు చేస్తారో మరి. నా వాలెట్, పాస్పోర్ట్ మరిచిపోయినట్లు చెబుతుంటారు. అదంతా అవాస్తవమే. అదంతా రెండు దశాబ్దాల కిందట జరిగింది" అని సమాధానం ఇచ్చాడు. అదే క్రమంలో స్మృతి స్పందిస్తూ.. "మీరు ఇప్పటి వరకు ఏదైనా అతి పెద్ద విషయాన్ని మరిచిపోయారా?" అని ప్రశ్నించింది. దానికి రోహిత్ సమాధానం ఇస్తూ.. "నేను ఆ విషయం చెప్పలేను. ఒకవేళ ఈ ప్రోగ్రామ్ లైవ్లో వస్తే మా ఆవిడ చూస్తుంది. కాబట్టి నేను చెప్పను. దానిని నాతోనే ఉంచుకుంటా" అని నవ్వుతూ వ్యాఖ్యానించాడు. అయితే, రోహిత్ దాచిపెట్టిన ఆ విషయం ఏంటనేదానిపై చర్చ మొదలైంది. ఓ హోటల్ గదిలో రోహిత్ తన వెడ్డింగ్ రింగ్ను మరిచిపోయిన ఘటనను ఫ్యాన్స్ గుర్తు చేశారు. 2015లో రితికాతో రోహిత్ వివాహమైన సంగతి తెలిసిందే.

### అప్పుడు హైదరాబాద్లో.. ఇప్పుడు ముంబయిలో

అనంతరం అవార్డుల కార్యక్రమంలో రోహిత్ మాట్లాడుతూ.. "భారత క్రికెట్కు సేవలు అందించిన గొప్ప ఆటగాళ్లను కలవడం ఆనందంగా ఉంది. మన ఆలోచనలను పంచుకోవడం బాగుంది. అద్భుతమైన ప్రదర్శన చేసిన ప్రతి ఒక్కరికీ రివార్డు దక్కుతుంది. గతంలో హైదరాబాద్లో ఇలాంటి కార్యక్రమం నిర్వహించినట్లు గుర్తు. ఇప్పుడు ముంబయిలో నిర్వహించడం అభినందనీయం" అని రోహిత్ వెల్లడించాడు.

### విరాట్ ఎందుకు హాజరుకాలేదంటే?

ముంబయిలో జరిగిన ఈ కార్యక్రమానికి భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి హాజరు కాలేదు. దీంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. అయితే దీనికి ఓ కారణముంది. రంజీ ట్రోఫీలో భాగంగా రైల్వేస్ మ్యాచ్ లో విరాట్ కోహ్లి దిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. మూడో రోజు ఆట సందర్భంగా ఫీల్డింగ్ చేశాడు. ఆ మ్యాచ్లో లో దిల్లీ విజయం సాధించింది. ఆ మ్యాచ్కు అందుబాటులో ఉండటంతో నమన్ అవార్డుల కార్యక్రమానికి హాజరు కాలేకపోయినట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

## ఇంటి చిట్కాలు

# ఎన్నిసార్లు చేసినా చపాతీలు అప్పడాల్లా వస్తున్నాయా, కొన్ని స్టెప్స్ ఫాలో అయితే మెత్తని సాఫ్ట్ చపాతీలు మీరూ చేస్తారు

**మన ఇళ్లలో చాలా మంది చపాతీలు చేస్తుంటారు. అయితే, కొంతమందికి ఇవి మెత్తగా సాఫ్ట్‌గా వస్తే, మరికొంతమందికి అప్పడాల్లా వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకోండి.**

ఏ పని అయినా మనం మొదలుపెట్టగానే రాదు. చేయగా చేయగా అందులో మనం ఎక్స్‌పర్ట్స్ అయిపోతాం. అందులోనే చపాతీలు కూడా. చపాతీలు చేయడం చాలా మందికి కష్టమైన పనిలా అనిపిస్తుంది. అంత ఈజీగా రావు కూడా. ఇదివరకటి రోజుల్లో చపాతీలు, రోటీలు ఎక్కువగా నార్త్ వాళ్లు మాత్రమే చేసుకునే డిష్‌లా ఉండేది. కానీ, ఇప్పుడు చాలా మంది చపాతీలను మన డైట్‌లో భాగం చేసుకున్నారు. బరువు తగ్గాలనుకునేవారు రాత్రుళ్లు అన్నం బదులు చపాతీలనే తింటున్నారు. మరి అంత ఇంపార్టెన్స్ ఉన్న చపాతీలని చక్కగా చేసుకుని తినడం అందరికీ అంత త్వరగా రాదు. కానీ, కొన్ని టిప్స్ ఫాలో అయితే, అందరూ కూడా యాడ్‌లో చూపించినంత సాఫ్ట్ చపాతీలను చేయొచ్చు. మరి అదెలానో తెలుసుకోండి.



### మంచి గోధుమపిండి



ముందుగా చపాతీలు చేయడానికి మంచి గోధుమపిండి తీసుకోవాలి. మార్కెట్లో దొరికే చాలా రకాల పిండిలో కల్తీ జరుగుతోంది. అలా కాకుండా మంచి చపాతీ పిండి తీసుకోండి. మీకు వీలైతే గోధుమలు తీసుకునే మీర మిల్లు పట్టించండి. దీంతో స్వచ్ఛమైన, కల్తీ లేని గోధుమ పిండిని వాడుకోవచ్చు.

### పిండి కలుపుకోవడం



ఇప్పుడు పిండిలో కొద్దిగా ఉప్పు, మరికొద్దిగా నూనె కావాలనుకుంటే నెయ్యి వేసి కలపండి. ఆ తర్వాత కొద్దికొద్దిగా నీరు కలుపుతూ పిండిని గట్టిగా కలపండి. అయితే, నీరు కలిపే విషయంలో జాగ్రత్త అవసరం. కొద్దికొద్దిగా నీరు వేయాలి. పిండి మరీ గట్టిగా ఉండకూడదు. అలా అని మరీ లూజ్‌గా ఉండకూడదు. చక్కగా మెత్తగా కలుపుకోండి.

### పక్కన పెట్టడం




కలిపి పెట్టుకున్న పిండిని మినిమం 15 నిమిషాలు ఓ పల్చని గుడ్డ కప్పి దానిపై ఓ బౌల్ పెట్టి నాననివ్వండి. దీంతో పిండి చక్కగా నానుతుంది. చపాతీలు కూడా చక్కగా మృదువుగా వస్తాయి. పిండిని ఆరనివ్వకుండా చూడండి.

### చపాతీలు చేయండి



ఇప్పుడు నానిన పిండిని చిన్న చిన్న ముద్దల్లా చేసి ఒక్కో ముద్దని చపాతీల్లా చేయాలి. కొద్దిగా స్ప్రెడ్ చేయగానే వాటిపై కొద్దిగా నెయ్యి, పొడి పిండి చల్లండి. దీనిని చుట్టి ఓ రోల్ చేసి ఇప్పుడు మళ్లీ చపాతీలు చేయండి.

### కాల్చడం



ఇలా తయారైన చపాతీలను వేడి చేసిన పెనం మీద వేయండి. ఒక వైపు కాస్తా బబుల్స్‌లా రానే తిప్పేసి మరోవైపు కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి చక్కగా కాల్చండి. ఇలా ప్రతీ స్టెప్ పర్ఫెక్ట్‌గా చేస్తే పూరీల్లా పొంగే చపాతీలు రెడీ అవుతాయి. మనం చేసేటప్పుడు ఓ సారి రోల్ చేసి మళ్లీ చేశాం కాబట్టి, లోపల కూడా పొరలు పొరలుగా చక్కగా వసాయి. ఈ చపాతీలను మీకిష్టమైన కూరతో ఆస్వాదించడమే.



